సమీకృత మార్కెట్‌కు మోక్షమెప్పుడో?

- మూలుగుతున్న రూ.3కోట్ల నిధులు
- 20 గుంటల స్థలం కోసం అన్వేషణ
- రోడ్డుపైనే వారసంత


నిరుపయోగంగా భవనాలు


రాయికల్‌లో రోడ్డుపైనే వారసంత

రాయికల్: రాయికల్ బల్దియాలోని ప్రజలకు ఒకేచోట అన్ని రకాల కూరగాయలు, మాంసాన్ని విక్రయించేందుకు గాను నాలుగేళ్ల క్రితం టీయూఎఫ్‌ఐడీసీ నిధుల నుంచి రూ.3కోట్లతో సమీకృత మార్కెట్‌కు నిధులు మంజూరయ్యాయి. రాయికల్ పట్టణ శివారులోని మార్కెట్ యార్డులో 20 గుంటల స్థలాన్ని అప్పటి జిల్లా కలెక్టర్ రవినాయక్ స్థలాన్ని ఎంపిక చేసి టెండర్ చేపట్టారు. పట్టణానికి దూరంగా ఉంటుందని, మార్కెట్ యార్డులో సమీకృత మార్కెట్ నిర్మిస్తే రైతులకు స్థలం సరిపోదనే ఉద్దేశంతో ఆందోళన బాట నిర్వహించారు. దీంతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయలేక పరారయ్యారు.

స్థలం కోసం అన్వేషణ

రాయికల్ బల్దియాలో సమీకృత మార్కెట్ కోసం మంజూరైన రూ.3కోట్ల నిధులు మార్కెట్ ఏర్పాటు చేయకపోవడంతో నిధులు తిరిగి ప్రభుత్వ ఖాతాలోకి చేరనున్నాయి. బల్దియాలో 20 గుంటల స్థలం సైతం లేకపోవడంతో సమీకృత మార్కెట్ ఏర్పాటు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం రాయికల్ మున్సిపాలిటీలో ప్రతి శనివారం జరిగే వారసంత క్రయవిక్రయాలు రోడ్డుపైనే నిర్వహించడంతో.. స్థానిక పాత బస్టాండ్ నుంచి ఇటిక్యాల క్రాసింగ్ రోడ్ వరకు ప్రతి శనివారం ట్రాఫిక్ జామ్‌తో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయలు, మాంసం విక్రయాల కోసం రూ.42లక్షల వ్యయంతో మార్కెట్ భవనం నిర్మించినా.. కూరగాయల వ్యాపారులు, మాంసం విక్రయదారులు ఈ భవనాన్ని వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. కూరగాయల వ్యాపారులు, మాంసం విక్రయదారులు రోడ్డు పక్కనే విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలక మండలి సభ్యులు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించి రాయికల్ పట్టణానికి మంజూరైన సమీకృత మార్కెట్‌ను యథావిధిగా కొనసాగించి ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రైతులు అడ్డుపడటంతో..



రాయికల్ మార్కెట్ యార్డులో అప్పటి కలెక్టర్ రవి నాయక్ 20 గుంటల స్థలాన్ని సేకరించి సమీకృత మార్కెట్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. రైతులు అడ్డుపడటంతో అక్కడ సమీకృత మార్కెట్ పనులను నిలిపివేశారు.

– మోర హన్మండ్లు, మున్సిపల్ చైర్మన్

ఏర్పాటుకు కృషి



రాయికల్ పట్టణంలో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.3కోట్లతో మంజూరైన సమీకృత మార్కెట్ పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండేలా పాలక మండలి సభ్యులతో చర్చిస్తాం. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సహకారంతో ఏర్పాటు చేసేలా కృషి చేస్తాం.

– చిరంజీవి, మున్సిపల్ కమిషనర్

అమ్మ మాట-అంగన్‌వాడీ బాట


అయిలాపూర్‌లో ప్రచారం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


పెగడపల్లిలో..

కోరుట్ల రూరల్: అయిలాపూర్, కల్లూర్, ధర్మారం, కిషన్‌రావుపల్లె, తిమ్మయపల్లె, ఎఖీన్‌పూర్ గ్రామాల్లో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటా ప్రచారం నిర్వహించి రెండున్నరేళ్ల పిల్లలను అంగన్‌వాడీ పాఠశాలకు పంపాలని సూచించారు. సూపర్‌వైజర్ శైనిమాథ్యు పాల్గొన్నారు.

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. స్వశక్తి సంఘాల మహిళలు, పిల్లల తల్లులు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇంటింటా అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని డబ్బా గ్రామంలో టీచర్లు నిర్వహించారు. సుందరగిరి గంగమణి, సంజీవరాణి తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు వేడుక


చేతులకు పెట్టుకున్న మైదాకు చూపిస్తున్న విద్యార్థినులు

కోరుట్ల: పట్టణంలోని మాస్తో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం గోరింటాకు వేడుక నిర్వహించారు. విద్యార్థులకు ఆషాఢ మాసంలో గోరింటాకు విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆకుల రాజేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం


సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

కథలాపూర్: చింతకుంట గ్రామానికి చెందిన చెదలు సత్యనారాయణ మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై గురువారం తొలిసారిగా కథలాపూర్‌కు రాగా.. మండల సంఘం తరఫున సన్మానించారు. టపాసులు కాల్చి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. వెలిచాల సత్యనారాయణ, గాండ్ల స్వామి, ఆకుల నర్సయ్య, న్యావనంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ సురేశ్‌బాబు

కోరుట్ల: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుట్ల సీఐ సురేశ్‌బాబు అన్నారు. పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మారక ద్రవ్యాలు-పౌర సమాజంపై వాటి దుష్ప్రభావాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. భారతీయ నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ కిరణ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మోటూరి రాజు, ఏవీవోపీఏ అధ్యక్షుడు కోటగిరి మహేశ్, బుడికె శ్రీకాంత్, ఎంఈవో గంగుల నరేశం, పట్టణంలోని వెటర్నరీ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


మైతాపూర్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో జగిత్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం మైతాపూర్ గ్రామంలో ఎన్‌హెచ్‌ఎం నిధుల నుంచి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా రూ.20లక్షల వ్యయంతో పల్లె దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాయికల్ పట్టణంలో గుడేటిరెడ్డి సంఘ భవనంలో 66 మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, 116 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా వైద్యాధికారి సమీరోద్దిన్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి, సింగిల్‌విండో చైర్మన్ మల్లారెడ్డి, తహసీల్దార్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డాంలో రోజుకో ప్రమాదం



జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం పెరుకపల్లి, రూరల్ మండలం హన్మాజీపేట గ్రామాల మధ్య ఉన్న రోడ్డాం 20 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రమాదకరంగా మారింది. రోజుకో ప్రమాదం జరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు మాత్రం తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంలో విఫలమయ్యారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

రాయికల్: పట్టణంలోని పోచమ్మ గుడి ముందు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ గురువారం హిందూ ధార్మిక సంస్థ సభ్యులు తహసీల్దార్ ఖయ్యుంకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇంటి యజమాని రషీద్‌ను వివరణ కోరగా.. ఎలాంటి అక్రమ నిర్మాణం చేపట్టలేదన్నారు.

తీజ్ ఉత్సవాల్లో ప్రభుత్వ విప్


కలిగోటలో తీజ్ ఉత్సవాల్లో ఆది శ్రీనివాస్

కథలాపూర్: మండలంలోని పలు గిరిజనతండాల్లో గురువారం సాయంత్రం తీజ్ ఉత్సవాలను గిరిజనులు ఘనంగా నిర్వహించారు. కలిగోట గిరిజన తండాలో జరిగిన తీజ్ ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్మపురి వాసికి పీహెచ్‌డీ

ధర్మపురి: అగ్రికల్చర్ యూనివర్సిటీలో అగ్రికల్చరల్ పీహెచ్‌డీ ఆగ్రోనామి సబ్జెక్టులో ధర్మపురి వాసి పట్టా దక్కించుకుంది. ధర్మపురికి చెందిన జక్కు దేవేందర్, దేవి కూతురు జక్కు ప్రసన్న కోయంబత్తూర్‌లోని తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీలో అగ్రికల్చరల్‌లో పీహెచ్‌డీ చేసి పీడీసీ తీసుకున్నారు. పీహెచ్‌డీలో తనకు గైడ్ చేసిన మారిముత్తుకు కృతజ్ఞతలు తెలిపారు.

వాహన దొంగ కోసం గాలింపు

జగిత్యాలక్రైం: కొత్త బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లిన దొంగ కోసం పోలీసులు గాలిస్తున్నారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన సుంకం నారాయణ ఈనెల 4న తన ద్విచక్ర వాహనాన్ని కొత్త బస్టాండ్‌లో పార్కింగ్ చేసి పని నిమిత్తం కరీంనగర్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ద్విచక్ర వాహనం లేకపోవడంతో పలుచోట్ల గాలించాడు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పట్టణ సీఐ వేణుగోపాల్ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన అనుమానిత దొంగ ఫొటోలను విడుదల చేశారు.

బాలుడి అదృశ్యం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన పులి రిషిందర్(16) అనే బాలుడు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు. నరేశ్ కుమారుడు రిషిందర్ బుధవారం తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే



కోరుట్ల రూరల్: అయిలాపూర్ గ్రామానికి చెందిన ఇ.లక్ష్మికి రూ.లక్ష ఎల్‌వోసీ మంజూరు కాగా.. మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ గురువారం అందజేశారు. బీఆర్ఎస్ నాయకుడు బద్దం తుక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా మొహర్రం


రాయికల్‌లో పులి వేషధారణలో యువకులు

రాయికల్: పట్టణంలో గురువారం మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక పాత బస్టాండ్‌లో పీరీలను ఊరేగించగా.. భక్తులు పీరీలకు దస్తీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

మల్యాల: మండల కేంద్రంలో మొహర్రం చివరి రోజున ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. పీరీలను గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. ప్రజలు పీరీలకు దస్తీలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక అంగడిబజార్‌లో తినుబండారాలు, ఆట బొమ్మల దుకాణాలతో సందడి నెలకొంది.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి


తిమ్మాపూర్‌లో మృతిచెందిన గేదెలు

ఇబ్రహీంపట్నం: తిమ్మాపూర్ గ్రామంలో విద్యుదాఘాతంతో గురువారం 2 గేదెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన రైతులు రాజేశుని లింగన్న, రాజేశుని ప్రణీత్‌కు చెందిన గేదెలు గ్రామ శివారులోని గన్నె గుట్ట ప్రాంతానికి మేత నిమిత్తం వెళ్లగా.. విద్యుత్ ఎల్‌టీ లైన్ తెగి పడటంతో గేదెలకు తగిలి అక్కడిక్కడే మృతి చెందాయి. రూ.లక్ష నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో వర్షం

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో గురువారం సాయంత్రం అతి భారీ వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో ఉదయం నుంచి చిరు జల్లులు కురుస్తున్నా.. సాయంత్రం ఏకధాటిగా రెండు గంటలపాటు అతి భారీ వర్షం కురిసింది.

అలరించిన చిన్నారి నాట్యం


నాట్య ప్రదర్శన చేస్తున్న నారాయణి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన చిన్నారి నారాయణి భరత నాట్యంలో ప్రతిభ కనబర్చింది. గోనె కార్తీక్-అరుణశ్రీ దంపతుల కుమార్తె నారాయణి చిన్నతనం నుంచే నాట్యంలో చురుగ్గా ఉంటోంది. బుధవారం శ్రీశైల దేవస్థాన ధర్మపథంలో బహుమతి సాధించింది.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్క నాటుతున్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో వన మహోత్సవంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతితో కలిసి మొక్కలు నాటారు. శయన ద్వాదశి సందర్భంగా సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామంలో బోరుబావి పనులను కృష్ణారావు పరిశీలించారు. గంగాధర్‌గౌడ్, కొంతం రాజం తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవంలో భాగంగా ఇటిక్యాల గ్రామంలో ప్రత్యేకాధికారి చిరంజీవి, కార్యదర్శి రాజేశ్ ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

జగిత్యాల: వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎంలో 17 ఏళ్లుగా పని చేస్తున్న 5,600 మంది సెకెండ్ ఏఎన్‌ఎంలను పట్టించుకోలేదని, న్యాయం చేయాలని సెకెండ్ ఏఎన్‌ఎం జిల్లా అధ్యక్షురాలు గాండ్ల మధురిమ అన్నారు. గురువారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెగ్యులర్ చేయకుండా తీరని అన్యాయం చేసిందన్నారు.

వీఆర్ఏలకు న్యాయం చేయాలి

జగిత్యాల: గత ప్రభుత్వం వీఆర్ఏల సర్దుబాటు కోసం తెచ్చిన జీవో 81ని సవరణ చేసి వీఆర్ఏలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వీఆర్ఏ హక్కుల పోరాట సమితి సభ్యులు వినతి పత్రం అందజేశారు.

రుణమాఫీ సంబరాలు


మల్యాల: సీఎం వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న రైతులు, నాయకులు


పెగడపల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, కాంగ్రెస్ శ్రేణులు

మల్యాల/పెగడపల్లి/కథలాపూర్/మెట్‌పల్లి/మల్లాపూర్/మెట్‌పల్లిరూరల్/కొండగట్టు/ఇబ్రహీంపట్నం/సారంగాపూర్/జగిత్యాలరూరల్/గొల్లపల్లి/బుగ్గారం/కోరుట్లరూరల్: రైతులకు ప్రభుత్వం పంట రుణాలు మాఫీ చేయడాన్ని హర్షిస్తూ జిల్లాలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఆయా మండలాల్లో స్థానిక రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు, నాయకులు పాల్గొన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం చిత్రాలకు క్షీరాభిషేకం చేశారు.


మెట్‌పల్లి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


మెట్‌పల్లిరూరల్: బండలింగాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

జాబ్‌చార్ట్ అమలు చేయాలి



క్యాంపు కార్యాలయ సమీపంలో ధర్నా చేస్తున్న ఆశాలు

జగిత్యాలటౌన్: ఆశావర్కర్లకు జాబ్‌చార్ట్ అమలు చేసి పనిభారం తగ్గించాలని, కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆశావర్కర్లు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ధర్నా చేశారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శికి వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఆత్మకూరి లత, నాయకురాలు జయలక్ష్మి, దివ్య, జీవలక్ష్మి, లావణ్య, వసంత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి


మల్లాపూర్ కేజీబీవీలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

మల్లాపూర్: విద్యార్థులు ఒక సమున్నత లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగితే విజయం సొంతమవుతుందని మెట్‌పల్లి ఆర్డీవో ఎన్.శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. తరగతి, వంట, హాస్టల్ గదులను పరిశీలించారు. తహసీల్దార్ వీర్‌సింగ్, ఆర్ఐ సురేష్, ప్రిన్సిపాల్ శ్రీలత, మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలువకు గండి



కోరుట్ల రూరల్: ధర్మారం శివారులో పెద్ద వాగు నుంచి మల్లాపూర్ మండలం సాతారం చెరువులోకి నీళ్లు వెళ్లే మాటు కాలువకు గండి పడి నీళ్లు వృథాగా పోతున్నాయి. ఇటీవల మాటు కాలువకు కాంక్రీట్ గోడ నిర్మాణం చేపట్టారు. గోడ పక్కన మొరం వేసి సరైన కాంపెక్టింగ్ చేయకపోవటంతో వర్షాలకు మొరం కోతకు గురై గండి పడ్డట్టు రైతులు పేర్కొన్నారు.

భార్యలు కౌన్సిలర్లు.. భర్తలు పార్టీ అధ్యక్షులు

రాయికల్: పట్టణంలో భార్యలు కౌన్సిలర్లుగా ఉంటూ భర్తలు మూడు పార్టీలకు అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. పట్టణంలోని 7వ వార్డు కౌన్సిలర్ ఎలిగేటి దివ్య భర్త అనిల్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా, 11వ వార్డు కౌన్సిలర్ మ్యాకల అనురాధ భర్త రమేశ్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా, 8వ వార్డు కౌన్సిలర్ కల్లెడ సునీత భర్త ధర్మపురి బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

బ్రిడ్జిపై వెళ్లాలంటే నరకమే..

చిత్ర కథ



రాయికల్: రామాజీపేట బ్రిడ్జిపై వర్షంలో ప్రయాణికులు వెళ్లాలంటే నరకయాతన పడాల్సిందే. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బ్రిడ్జి బురదమయంగా మారింది. కాంట్రాక్టర్ బీటీ రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి బ్రిడ్జిపై బీటీ రోడ్డు నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని కోరుతున్నారు.

సెల్‌ఫోన్ అందజేత

రాయికల్: పట్టణంలోని భువనగిరి భీమయ్యకు చెందిన సెల్‌ఫోన్ 2 నెలల క్రితం పోయింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి ఎస్సై అశోక్ గురువారం బాధితుడికి అందజేశారు.